క్లుప్తంగా

ఎల్ఐపీతో విద్యార్థుల అభివృద్ధి



విద్యార్థులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి మంగ్యానాయక్

మిర్యాలగూడ : లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(ఎల్ఐపీ) విద్యార్థుల అభివృద్ధికి దోహదపడుతుందని మండల నోడల్ అధికారి ఆర్.మంగ్యానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని జప్తివీరప్పగూడెం జెడ్పీహెచ్ఎస్, వెంకటాద్రిపాలెంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎల్ఐపీ అమలవుతున్న తీరును, తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన విధానాన్ని పరిశీలించి మాట్లాడారు. బోధనోపకరణాలను ఉపయోగించి పాఠ్యాంశాలను బోధించినట్లయితే విద్యార్థులు త్వరగా విషయాన్ని గ్రహించగల్గుగారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శిరీష, ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య, దామోదర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మాధవి, శ్రీనివాస్‌రెడ్డి, బలరాం, చంద్రకళ, రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



చింతపల్లిలో గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహిస్తున్న యాదవులు

చింతపల్లి : మండల కేంద్రంతో పాటు మండలంలోని గడియగౌరారం గ్రామాల్లో బుధవారం పెద్దమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. మొదటిరోజు పెద్దమ్మ తల్లి పెట్టే కదిలిచ్చుట, గ్రామంలోని బొడ్రాయి, ముత్యాలమ్మ, ఎల్లమ్మ తదితర గ్రామ దేవతలకు డబ్బు చప్పులతో పూనకాలు ఊగుతూ గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్, శైలేశ్వర్, నగేష్, మల్లేష్, రవి, సైదులు, వెంకటయ్య, భిక్షం పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

గుర్రంపోడు : ఇటీవల బీఆర్ఎస్ పార్టీలో చేరిన సీనియర్ నాయకుడు అందుగుల ఏడుకొండలు బుధవారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి సమక్షంలో తిరిగి బీజేపీలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, బీజేపీ జిల్లా నాయకుడు అంజయ్య యాదవ్, గిరిజన మోర్చా నాయకులు పాల్గొన్నారు.

లచ్చిరాంనాయక్ విగ్రహ ఆవిష్కరణ

హాలియా : అనుముల మండలంలోని వీర్లగడ్డ తండాకు చెందిన క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ దివంగత దేపావత్ లచ్చిరాం నాయక్ ప్రథమ వర్ధంతి బుధవారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన దేపావత్ లచ్చిరాం నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బాబురావు నాయక్, మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు యాదవ్, మాజీ సర్పంచ్ సంధ్యరాము నాయక్, నాయకులు మనాది పురుషోత్తం యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

త్రిపురారం ఎస్ఐగా ప్రసాద్



త్రిపురారం : మండల ఎస్ఐగా వై ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన వీర శేఖర్ నల్లగొండ వీఆర్‌కు బదిలీకాగా సూర్యాపేట వీఆర్ నుంచి వై ప్రసాద్ త్రిపురారం మండలాని వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

కుళ్లిన కేక్ విక్రయం

- బేకరీ యజమానిని నిలదీసిన వినియోగదారుడు

మిర్యాలగూడ అర్బన్ : కుళ్లిపోయి దుర్వాసన వస్తున కేక్‌ను ఓ బేకరి యాజమాన్యం విక్రయించింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన ఓ వినియోగదారుడు తన కుమారిడి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం సాగర్‌రోడ్డులో గల కరాచీ బేకరీలో కేక్ కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాడు. కట్ చేందుకు బయటకు తీయగా దుర్వాసన రావడంతో షాపుకు వచ్చి యాజమాన్యాన్ని నిలదీశాడు. కేక్‌ను రుచి చూసిన యజమాని కుళ్లిపోయిందా? అయితే వేరేది ఇస్తా తీసుకెళ్లండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. ఈ వీడియోను సదరు వినియోగదారుడు సోషల్‌మీడియాలో పోస్టు చేయగా వైరల్‌గా మారింది. వీడియో చూసిన నెటిజన్లు తమదైన శైలిలో స్పందించారు. ఫుడ్ సెఫ్టీ అధికారులెక్కడ? అంటూ కామెంట్లు చేయడం గమనార్హం. ఆహారపదార్థాల కల్తీ నాశిరకం విక్రయాలను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఖాళీ స్థలాలతో కలవరం

- నిత్యం దోమలతో సమరం
- రోగాలకు అవాసాలుగా మారిన ఓపెన్ ప్లాట్లు
- అధికారికంగా 1500పైగా ఖాళీ స్థలాలు గుర్తింపు
- యజమానులకు నోటీసులు జారీ చేసినా స్పందన కరవు



ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న మురుగు



తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీలో రోడ్డు వెంట నిల్వ ఉన్న మురుగు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలోని ఓపెన్ ప్లాట్లు ఇబ్బందిగా మారాయి. వర్షాకాలంలో ఖాళీ స్థలాలు దోమలకు అవాసంగా మారుతున్నాయి. ఖాళీ స్థలాల్లో చెత్త చెదారం, పిచ్చి మొక్కలు, పొదలు పెరిగి పారిశుద్ధ్యం కొరవడుతోంది. దీంతో ఖాళీస్థల స్థల యజమానులకు నోటీసులు జారీ చేసినా స్పందన లేదు. ఒకవైపు వీటిని అవాసాలుగా చేసుకొని సన్న దోమలు తమ సంతతిని పెంచుకుంటున్నాయి. సాయంత్రం ఐదుగంటలు దాటితే సాలు ఇళ్లలో దోమల బాధతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ మధ్య కాలంలో దోమలకు తోడు సన్న దోమలు విపరీతంగా వస్తున్నాయి. ఈ సన్న దోమ కుట్టిందంటే చాలు విపరీతమైన పంటతో పాటు దద్దులు వస్తున్నాయి.

ప్రత్యేక శ్రద్ధ అవసరం ..

పట్టణంలో 48 వార్డుల్లో సుమారు వెయ్యి నుంచి 1500కు పైగానే ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, మురుగు నీటిని తొలగించి ప్లాట్లు శుభ్రం చేయించుకోవాలని ఇప్పటికే మున్సిపల్ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. కాగా అధికారులు ఇచ్చిన నోటీసులకు ఎవరూ స్పందించడం లేదు.ఆ యా స్థలాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టని యాజమానులకు జరిమానా విధించే అవకాశం ఉన్నప్పటికీ స్పందిస్తలేరు. సరైనా మురుగునీటి పారుదల లేకపోవడంతో అరకొర పారిశుద్ధ్య పనులతో సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. తాత్కాలిక చర్యలు తప్ప ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కావడం లేదు.

సన్నదోమలు వస్తున్నాయి



వార్డుల్లో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రధానంగా సన్న దోమతో మరింత ఇబ్బందిగా మారింది. ఇంటి తలుపులు తెరిచి ఉంచే పరిస్థితి లేదు. వర్షాకాలంలో మురుగునీరు నిల్వ ఉండటంతో పాటు చిన్న చిన్న డ్రెయినేజీల్లో సరిగా పూడికతీత తీయకపోవడంతో వర్షాలు వస్తే మురుగు నీరు గుంతల్లో నిల్వ ఉండి దోమలు విపరీతంగా వస్తున్నాయి. దోమల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి.

\- సుధాకర్ చౌదరి, రాంనగర్ మిర్యాలగూడ

మున్సిపాలిటీ నుంచి శుభ్రం చేయిస్తాం



ఖాళీ స్థలాలు ఉన్న యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేసేందు చర్యలు తీసుకుంటున్నాం. అయితే ఖాళీ స్థలాలను మున్సిపాలిటీ ద్వారా శుభ్రం చేయించి రుసుము చెల్లించేలా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నాం. ప్రతి రోజు మూడు, నాలుగు వార్డులను చొప్పున ఫాగింగ్ చేయిస్తున్నాం.

\- వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, మిర్యాలగూడ

వైద్యులు సమయపాలన పాటించాలి

- డీసీహెచ్ఎస్ మాతృనాయక్



ప్రాంతీయ ఆస్పత్రిలో పరిసరాలను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ మాతృనాయక్

దేవరకొండ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు సమయపాలన పాటించాలని డీసీహెచ్ఎస్(డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్) మాతృనాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఆయా వార్డుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆయన ఆరా తీశారు. ఆస్పత్రి ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ మంగ్తానాయక్‌కు సూచించారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి వివరాలు సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని వంద పడకల నుంచి రెండు వందల పడకల స్థాయికి అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలిపారు. ఆయన వెంట వైద్యులు ఉన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం



మెగా వైద్యశిబిరం ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

దేవరకొండ : గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడం కోసం స్థానికంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండ మండలం తూర్పుపల్లిలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ, ఆర్థిక సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైద్యశిబిరం ఏర్పాటుకు సహకరించిన అంకూరి నర్సింహను ఆయన అభినందించారు. వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్నాటి సురేష్, పెరిక ముని కుమార్, వస్కుల సత్యనారాయణ, వినోద్ రాథోడ్, కుంభం తిరుపతి, గుండాల అంజయ్య, జెల్లా భాస్కర్, సహదేవ్, ఎర్ర భిక్షపతి, దర్శనం శ్రీను, యాదగిరి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు సమష్టిగా కృషి చేద్దాం



చింతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, వివిధ శాఖల అధికారులు

చింతపల్లి : గంజాయి నిర్మూలనకు సమిష్టిగా కృషి చేద్దామని సీఐ నవీన్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ వద్ద మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గంజాయి వాడకందారులు ఇళ్లు, ఒళ్లు గుల చేసుకోవడమే గాక జీవితకాలం జైలుపాలు కావడం తప్పదని హెచ్చరించారు. మనిషి మనుగడను నాశనం చేసే గంజాయి మహమ్మారిని సమూలంగా నిర్మూలించడానికి సమాజంలో అందరం బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానం యువత గంజాయిని ఆశించి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఆవుల చంద్రకళ, ఎంపీడీఓ సుజాత, ఏపీఎం విజయలక్ష్మి, ఎస్ఐ భీమనమోని యాదయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీత, సీసీలు రాములు వెంకటరమణ రాజశేఖర్ విజయ వెంకటయ్య, ఈజీఎస్ సిబ్బంది వీఓ ఏలు ఆయా గ్రామాల వీఓ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



పెద్దవూర : గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ తరి రాములు

పెద్దవూర : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి దేశ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు తీసుకురావాలని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పాఠశాలల స్థాయి బాల, బాలికల కబడ్డీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడలతో స్నేహ భావంతో పాటు, శారీరక, మానసిక ఉల్లాసాలు కలుగుతాయన్నారు. ఓడిపోయినంత మాత్రానా నిరుత్సాహ పడకుండా గెలుపుకోసం ప్రయత్రించాలని పేర్కొన్నారు. పోటీల్లో బాలుర విభాగంలో ప్రథమ బహుమతిని పులిచర్ల జెడ్పీహెచ్ఎస్, ద్వితీయ బహుమతిని శాంతినికేతన్ గురుకుల పాఠశాల, బాలికల విభాగంలో ప్రథమ బహుమతిని పులిచర్ల జెడ్పీహెచ్ఎస్, ద్వితీయ బహుమతిని న్యూకిడ్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గెలుచుకున్నారు. అనంతరం వీరికి షీల్డ్‌లను బహూకరించారు. ఉత్తమ క్రీడాకారులకు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఒలమాల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌బాబు, షీల్డ్‌ల దాత, శాంతినికేతన్ పాఠశాల హెచ్ఎం నడ్డి ఆంజనేయులు, సుదర్శన్, డి.బాలోజీ, రామాంజిరెడ్డి, పీడీలు సంధ్యారాణి, శివరాం, మురళి, లెనిన్, రామయ్య, యమున తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ



అడవిదేవులపల్లి : గోన్యాతండాలో సర్వే నిర్వహిస్తున్న ఏఓ గుర్రం సరిత



చింతపల్లి : వర్కాల గ్రామసభలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి



డిండి : రైతులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి రామలింగేశ్వరరావు

హాలియా : రుణమాఫీ వర్తించని రైతు కుటుంబాలను నిర్ధారించేందుకు ప్రభుత్వం చేపట్టిన రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే ప్రక్రియ బుధవారం అనుముల మండలంలోని శ్రీనాథపురం గ్రామంలో మండల నోడల్ అధికారి, ఏఓ సరిత ప్రారంభించారు. సర్వేలో భాగంగా జాబితా ఆధారంగా శ్రీనాథపురం గ్రామంలో రుణమాఫీ అందని 18 మంది రైతుల కుటుంబ సభ్యులను వివరాలను నమోదు చేశారు. ఆధార్‌కార్డు, ఇతర ధ్రువపత్రాలను, పట్టాదారు పాస్ పుస్తకం, క్రాప్ లోన్ బ్యాంక్ అకౌంట్ వివరాలను పరిశీలించి కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగి రైతు భరోసా పంట రుణమాఫీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు.

వచ్చే నెల 25 వరకు..

రుణమాఫీ వర్తించని రైతు కుటుంబాలను నిర్ధారించే ప్రక్రియ మండలంలో ఈనెల 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు కొనసాగనున్నట్లు మండల నోడల్ అధికారి సరిత తెలిపారు. ఈనెల 28న శ్రీనాథపురం 29న ముక్కమాల, 30న అనుముల, 31న పులిమామిడి, సెప్టెంబర్ 2న కొత్తపల్లి, 3న పేరూర్, మదారిగూడెం, కొర్రివేనిగూడెం, 4న పాలెం, 5న అన్నారం, తిమ్మాపురం, 9వ తేదీన కెకె కాలువ, ఇబ్రహీంపేట, 11న పుల్లారెడ్డిగూడెం, వీర్లగడ్డతండా, 12న రామడుగు, 13న వెంకటాద్రిపాలెం, 18న అంబటిపాలెం, 19న హజారిగూడెం, నాయుడుపాలెం, 20న మారేపల్లి, 21న యాచారం, 23న చల్మారెడ్డిగూడెం, 24న కొనలమర్రి, 25న కుపాసిపల్లి గ్రామాల్లో రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి కుటుంబ సర్వే

పెద్దఅడిశర్లపల్లి : పెద్దఅడిశర్లపల్లి మండలంలో రేషన్ కార్డులేని రైతుల కుటుంబ సర్వే గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పాండు అన్నారు. గురువారం కేశంనేనిపల్లి, ఘనపురం గ్రామాల్లో, ఈ నెల 29న గుడిపల్లి, 30న భీమనపల్లిలో, 31న పోల్కంపల్లి, మాధాపురంలో, సెప్టెంబర్ 2న పెద్దఅడిశర్లపల్లి, బాలాజీనగర్‌లో, 3న అంగడిపేట, అక్కంపల్లిలో, 4న చింతల్ తండా, వద్దిపట్ల, పడమటి తండాలో, 5న మల్లాపురం, ఎర్రగుంటతండా, అజ్మాపురంలో, 6న రంగారెడ్డిగూడెం, మేడారంలలో, 9న దుగ్యాలలో, 10న తిరుమలగిరిలో, 11 న చిల్కమర్రి, రోళ్లకల్లు, సూరేపల్లిలో, 12న ఘట్‌నెమలిపురంలో రేషన్ కార్డు లేని రైతుల కుటుంబ సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అడవిదేవులపల్లి : వివిధ కారణాలతో రుణ మాఫీ కాని రైతులకు సంబంధించిన కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేసేందుకు ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు మండల వ్యవసాయ అధికారిని గుర్రం సరిత అన్నారు. బుధవారం మండలంలోని గోన్యాతండాలో రుణమాఫీకి సంబంధించిన సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో రుణ మాఫీకి సంబంధించిన కుటుంబ సభ్యుల వివరాలతో పాటు వారి ధ్రువ ప్రతాలు పూర్తి చేసి వారి కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు జీరాక్స్ జతపరిచి గ్రామ కార్యదర్శి, మండల వ్యవసాయ కార్యాలయంలోని గానీ, ఏఈఓలకు గాని అందించాలన్నారు. ఆమె వెంట ఏఈఓ మహేష్‌తో పాటు పలువురు రైతులు తదితరులున్నారు.

చింతపల్లి : మండల పరిధిలోని వర్కాల, నసర్లపల్లి గ్రామాల్లో రైతు రుణమాఫీ కానీ రైతుల వివరాలు సేకరించేందుకు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి మాట్లాడుతూ రైతు కుటుంబ సభ్యులందరూ ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు తీసుకోని గ్రామ సభలకు హాజరుకావాలని సూచించారు. 29న నేలవ్లపల్లి, తీదేడు, 30న తిరుమలాపురం, ఉప్పరపల్లి, 31న గడియ గౌరారం, అరిజనాపురం, 2న కురుమేడు, గొల్లపల్లి 3న ప్రశాంతపురి తండా, కుర్మపల్లి 4న సాయిరెడ్డిగూడెం, మోదుగుల మల్లేపల్లి, 5న మల్లారెడ్డిపల్లి, హోమంతాలపల్లి, 6న వింజమూరు, కిష్టరాయనపల్లి, 9న జర్పుల తండా, అనాజీపూర్, కొక్కిరాల గౌరారం, 10న రాయినిగూడెం, ధైర్యపురితండా, 11న దేన్యతండా, చింతపల్లి, 12న పీకే మల్లేపల్లి, రోటి గడ్డ తండా, 17న బోటిమీది తండా, పాలెం తండా, 18న మదనాపురం, ఉమ్మాపురం 19న చాకలిసేరిపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డిండి : అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ అందుతుందని నోడల్ అధికారి రామలింగేశ్వరావు అన్నారు. జిల్లా ఉన్నతాధికారులాదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని గోనకొల్ గ్రామంలో విలేజ్ సర్వేలో భాగంగా వ్యవసాయాధికారులు ఏర్పాటు చేసిన రేషన్ కార్డు లేక పోవడంతో రూ. 2 లక్షల వరకు రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో విలేజ్ సర్వే కొనసాగుతుందని, రూ. 2లక్షల రుణం కన్న ఎక్కువగా ఉన్న అమౌంట్‌ను బ్యాంకులో కట్టాలని సూచించారు.

పెద్దవూర : రేషన్ కార్డు లేని రూ.2లక్షల లోపు రుణమాఫీ కాని రైతుల వివరాల నమోదుకు మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని సంగారం, పెద్దవూర గ్రామాల్లో రూ.2లక్షల లోపు అర్హులై ఉండి రుణమాఫీ కాని రైతుల ఇంటింటికి వెళ్లి వారి వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఓ అధికారి సందీప్ మాట్లాడుతూ రేషన్ కార్డు లేని వారు రుణమాఫీ కావడానికి వ్యవసాయ శాఖ అధికారులు ఇంటికీ వచ్చినప్పుడు కుటుంబ సభ్యుల అందరి ఆధార్ కార్డులను విధిగా అందించాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ, రైతులు ఉన్నారు.


యువత సామాజిక దృక్పథంతో ఉండాలి



మాట్లాడుతున్న డైమండ్ ఐ బ్యాంక్ నిర్వాహకుడు మాశెట్టి శ్రీనివాస్

మిర్యాలగూడ : యువత సామాజికి దృక్పథం కలిగి ఉండాలని డైమండ్ ఐ బ్యాంక్ నిర్వాహకులు మాశెట్టి శ్రీనివాస్ అన్నారు. 39వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు సందర్భంగా పట్టణంలోని డైమండ్ ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కల్పించి ఆయన మాట్లాడారు. అనంతరం ఏరియా ఆస్పత్రి వద్ద రోగులకు , బంధువులకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో డైమండ్ ఐ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వన్‌టౌన్ సీఐగా కరుణాకర్



మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐగా కోట కరుణాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సీఐ సుధాకర్ బదిలీపై వెళ్లగా నల్లగొండ లోని ఉమెన్స్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కోట కరుణాకర్‌కు జిల్లా పోలీస శాఖ అధికారులు ఇన్‌చార్జ్ సీఐగా బాధ్యతలు అప్పగించారు. శాంతిభద్రత పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు.

వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి



జెండా ఆవిష్కరిస్తున్న పాలగాని వెంకటేష్‌గౌడ్

మిర్యాలగూడ టౌన్ : వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు పదిశాతం కల్పించాలని రాష్ట వికలాంగుల కన్వీనర్ పాలగాని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానికంగా సంఘం పట్టణ అధ్యక్షుడు సైదులు ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి 18వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వికలాంగులందరికీ ఉచిత బస్సు పాసు సౌకర్యం కల్పించాలన్నారు. త్వరలోనే రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యవర్మతో కలిసి రాష్ట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వికలాంగుల సమస్యలు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం ఇన్‌చార్జ్ మేకల నాగరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు చైతన్యరెడ్డి, దర్శనం సైదులు, పాల్వాయి సుధాకర్, తాళ్లపల్లి సురేష్, ఫారూక్, నీలకంఠంనాయక్, గిరిచారి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర ఎస్ఐపై ఆరోపణలు సరికాదు



సాగర్ సీఐ బీషన్నను సన్మానిస్తున్న లింగన్న

పెద్దవూర : దళితులు ఇచ్చిన ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పెద్దవూర ఎస్ఐపై ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు చేసిన ఆరోపణలు నిరాధారమని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు మొండికత్తి లింగన్న అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ పెద్దవూర ఎస్ఐ వీరబాబు దళితులు, ప్రజా సంఘాలపై ఎంతో సానుకూలతతో ఉంటారని, చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించే మనస్తత్వం కలవాడన్నారు. పెద్దవూర ఎస్ఐపై ఆరోపణలు చేస్తూ మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించడం వారి స్వలాభం కోసమేనన్నారు. ఇందులో ముమ్మాటికి అగ్రవర్ణాల కుట్రకోణం దాగి ఉందని తెలిపారు. ఒక నిజాయితీ గల ఎస్ఐపై నిరసన ర్యాలీలు, ధర్నాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో సాగర్ సీఐ బీషన్నను శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు వంగూరి కిరణ్‌కుమార్, మండల అధ్యక్షుడు ఇద్దయ్య, నాయకులు జల్లా నరేందర్, మల్లేపల్లి నాగార్జున, మాతంగి సైదులు, యుగేందర్, బాబు, శ్రావణ్, కృష్ణ, చిన్న రాయుడు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా

నల్లగొండ టౌన్: పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా సెప్టెంబరు 2న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపు నిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి పూర్తి స్థాయిలో మెజార్టీ రాకపోయినప్పటికీ గత విధానాలనే అవలంబిస్తుందని ఆరోపించారు. కేవలం సంపన్న వర్గాలకు మేలు చేసే విధంగా వ్యవహరిస్తూ పేదలపై ధరల భారాన్ని మోపుతుందన్నారు. ఉజ్జిని యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు వీరస్వామి, వెంకటరమణ, నరసింహ, వెంకటేశ్వర్లు, రామచంద్రం, ఆర్.అంజయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంగం డెయిరీ వద్ద రైతుల ఆందోళన

- తమ డబ్బులు చెల్లించి డెయిరీ ప్రారంభించాలని రైతుల డిమాండ్



సంగం డెయిరీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న సంగం డెయిరీ వద్ద రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. శ్రీనివాస్‌నగర్‌లో గతంలో ఉన్న వీటీ డెయిరీ బ్యాంక్ రుణం తీర్చకపోవడంతో ఎస్‌బీఐ వేలం వేయగా సంగం డెయిరీ కొనుగోలు చేసింది. బుధవారం డెయిరీని ప్రారంభించారు. దీంతో శ్రీనివాస్‌నగర్ గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని రైతులు తాము డెయిరీలో పెట్టుబడులు పెట్టడంతోపాటు పాలు పోశామని, ఆ డబ్బులను వీటీ డెయిరీ ఇవ్వలేదని, ప్రస్తుత సంగం డెయిరీ చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో వీటీ డెయిరీలో 500మంది వరకు ఉపాధి పొందారని ప్రస్తుతం సంగం డెయిరీ ఆంధ్ర ప్రాంతం నుంచి తీసుకొచ్చిన సిబ్బందితో పనులు చేయిస్తున్నారని, డెయిరీలో ఇక్కడ వారికి మాత్రమే పని కల్పించాలన్నారు. డెయిరీలో పెట్టుబడులు పెట్టిన రైతులందరికీ ఇవ్వాల్సిన డబ్బులను చెల్లించాలన్నారు. అదేవిధంగా వీటీ డెయిరీ యజమానులు వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణలు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం వీటీ డెయిరీ యూనిట్‌తో పాటు ఉన్న భూముల విలువ సుమారు రూ.25కోట్లు ఉంటుందని, బ్యాంకు వారు తమకు సమాచారం అందించకుండానే సంగం డెయిరీతో కుమ్మక్కై రూ.11.50కోట్లకే వేలంలో అప్పగించారన్నారు. ఈ విషయం హైకోర్టులో కేసు నడుస్తుందన్నారు. ప్రస్తుత మార్కెట్ వాల్యూ ప్రకారం డబ్బులు చెల్లించడంతోపాటు రైతులకు ఇవ్వాల్సిన డబ్బులను చెల్లించి డెయిరీని నడపాలన్నారు.